ఎవరి దదృష్టం?

శ్రీమతి బసవరాజు వేంకటరాజ్యలక్ష్మిగారు

కమలాసరళలిద్దరు ఏలూరులో ఒకబడిలోనే చదువుతుండిరి. ప్రాణస్నేహితలు. బళ్లోకి వెళ్లేటప్పుడు గాని వచ్చేటప్పుడు గాని నిమిష మైనా యెడబాసి యుండరు. ఆటలలో నైనా విరోధమెప్పుడూ యెరగరు. ఒకవేళ వచ్చినా నిముషములోనే పోయేది. చదువులో కూడా చాల తెలివిగా చదువుతుండేవారు. ఉపాధ్యాయునికికూడా కమలాసరళలంటే చాల సంతోషం. బడిలో ఆటగంటకొట్టగానే అందరూ పరుగెత్తుకువచ్చేవాళ్లు. ఆటల్లో కూడా వీళ్లిద్దరే నాయకురాండ్రు. కమల పిల్లలందరిని రెండు వరుసలుగా భాగించేది. ఒకవరుస అటువైపు యింకొకవరుస యిటువైపు. ఒక వరుసకు నాయకురాలు సరళ, ఇంకొకవరుసకు నాయకురాలు కమల. ఒకవరుసవారు రెండవ వరుస వారికి ఎదురుగుండా ఒకరిబుజముల మీద ఒకరు చేతులు వేసుకుని

"వస్తున్నాము వస్తున్నాము యీసాయంకాలమూ" అని పాడటమూ,

రెండవ వరుసవారు,

"ఎవరికోసం వస్తున్నారు యీ సాయంకాలమూ" అని పాడటమూ,

"కమలకోసం వస్తున్నాము యీసాయంకాలము" అని సరళా, సరళజట్టులోనివారు పాడుతూండగా సరళ వెళ్లి కమలని చెయి పట్టుకుని గుంజి వీళ్ల జట్టులో కలుపుకోవటమూ ఇల్లాగే ఆవరుసవారందరూ వీళ్ల జట్టులోకొచ్చే వరకూ ఆ మొదటపాటపాడి అందరిని లాక్కొచ్చేవాళ్లు. సరళ గెలిచిందనే ఉక్రోషము కమలకుండేది. కాని అది కొంచెంసేపటిలోనే పోయేది. మళ్లీ "సరళా, రా, పులీ మేకా ఆడుకుందాం" అని పిలిచేది. ఈవిధముగా వారి యిష్టమువచ్చిన ఆటలన్నీ ఆడుకుని సాయంకాలము కు యింటికివచ్చేవాళ్లు. సరళ యిల్లు కమలయిల్లు దగ్గరదగ్గరగానే వుంటవి.

సరళ తండ్రి మాధవరావుగారు, తల్లి సీతాబాయమ్మగారు యిప్పటి నవనాగరికులు. బాల్యవివాహనిరోధమునకు చాలా పాటుపడుతున్నారు. ఆవూరిలోనే స్త్రీలకు క్లబ్బుఒకటి స్థాపించి కొంతమంది స్త్రీలను మెంబర్లుగా చేర్పించి టెన్నీసు, పింగ్ పాంగ్ మొదలయినవన్నీ పెట్టించారు. స్త్రీలుగూడా పురుషులతో సమముగా ఉండవలెనన్న పద్ధతిలోనివారు. సీతాబాయమ్మగారు ఆంగ్లము చదువనూ, వ్రాయను బాగా నేర్చుకున్నారు. ప్రతిరోజూ సాయంకాలము 5 గంటలకల్లా కాలికి మేజోళ్లూ బూట్సులు తొడుక్కొని క్లబ్బుకు వెళ్లి టెన్నిసు ఆడేవారు. ఆక్లబ్బులో వాళ్లతోపాటు చదువుకున్నవాళ్లనే గౌరవము చేయు

టమూ, చదువుకోనివాళ్లని గౌరవించక పోవటముచేత చాలామంది స్త్రీలు మెంబర్లుగా చేరలేదు. ఉద్యోగస్తుల భార్యలంతా కుర్చీలో కూర్చోటం సాధారణ స్త్రీలందరిని క్రింద కూర్చోబెట్టటం వారికి రిపెక్టైనది. అందువల్ల ఉద్యోగస్తుల భార్యలు తప్ప యితరులు వెళ్లటం లేదు. సరళకూడా బడినుంచి రాగానే తల్లితో క్లబ్బుకు వెడుతుండేది. కూడా కమల కూడా వెళ్లేది.

కమల తండ్రి నారాయణమూర్తి గారు తల్లి వరలక్ష్మమ్మగారు. చాలా నిష్ఠపరులు. మన హిందూ సంప్రదాయానుసారంగా బాల్యవివాహములు చేయవలెననేవారు వరలక్ష్మమ్మగారు పార్వతీదేవల్లే పసుపు పూసుకుని పెద్దకుంకుమబొట్టు పెట్టుకుని ఇప్పటివారిలాగు క్లబ్బులకు వెళ్లక పురాణములకో దేవాలయములకో వెళ్లేవారు. లేకపోతే యింట్లోనే యుండి రాట్నము వడికేవారు.

కమలా సరళలకిప్పుడు పన్నెండవ యేడు. నారాయణమూర్తి గారు, వరలక్ష్మమ్మ గారు కమల వివాహము చేయవలెనని చాలా తొందర పడుతున్నారు. సంసారపక్షములో కొంచెం బాగున్న సంబంధం వెతుకుతున్నారు. సరళ తలిదండ్రులు శారదాబిల్లుప్రకారము చేయదలచుకున్నవారు గనుక తొందర లేదు గదాయని సరళని బాగా చదివించుతున్నారు.

కమలకి పెళ్లి ప్రయత్నము జరుగుచుండగా కమలా సరళలకు వాద వివాదములొచ్చినవి. “పదహారేళ్లకు పెళ్లి చేసుకోవాలిగాని పన్నెండ్లకు పెళ్లేమిటి? నాస్నేహితురాలవై యుండి నీవు పన్నెండేళ్లకి పెళ్లి చేసుకోటం నాకిష్టం లేదు. పెళ్లి చేసుకోగానే చదువు మాన్పిస్తారు. చిన్నతనంలో పెళ్లిళ్లవల్ల అనేకకష్టాలున్నయి. నీవు పెళ్లిచేసుకోవ”ద్దనేది సరళ. “పూర్వసంప్రదాయానుసారంగా పెళ్లి చేసుకోటమే మంచి”దనేది కమల.

అక్కడికి దగ్గరలోనే విజయరాయిలో సంబంధం కుదుర్చుకున్నారు కమలకి. పిల్లడి పేరు దామోదరం. స్కూల్ ఫైనలు పరీక్ష ప్యాస్ అయినాడు. జాతీయోద్యమసందర్భమున చదువుమానినాడు. అదిగాక యీకాలంలో బ్రాహ్మణికి ఉద్యోగాలిచ్చేవాళ్లేలేరని గ్రహించి పైక్లాసు చదవక ఆ వూరిలోనే ఆశ్రమంలాంటి యిల్లు, తోట, సొంత వ్యవసాయం, పాడి పంట చూసుకుంటూ పార్వతీపరమేశ్వరుల లాంటి తలిదండ్రులతో చాలా ఆనందంగా వున్నాడు. చరఖాసంఘం ఒకటి ఏర్పాటు చేసి, హిందీపాఠశాల ఒకటి పెట్టించి అందరిచేత టైముప్రకారం చరఖా వడికిస్తూ పిల్లలకి హిందీ చెపుతూ మిగిలినరోజంతా తనతండ్రికి వ్యవసాయంలో తోడ్పడుతుండేవాడు. దామోదరం తల్లికూడా ఇప్పటికాలపువారి మోస్తరుగా దాసీలనూ, బోనగత్తెలనీ పెట్టక అన్నీ స్వంతముగా చేసుకుని భోజనములయిన తరువాత చుట్టూ పదిమందిని చేర్చుకుని వృథాకాలక్షేపముచేయక రాట్నం

వడికేది. వాళ్లు కూడా తమ రాట్నము లను ఆమెదగ్గరకే తెచ్చుకుని వడుక్కునే వారు. ఇవన్నీచూచే సంసార పక్షములో బాగుందని నారాయణమూర్తి గారు వప్పుకు న్నారు. కట్నకానుకల విషయంలో వారేమీ అడుగలేదు. వెంటనే సమ్మతించారు. నారా యణమూర్తిగారివల్ల విని వరలక్ష్మమ్మగారు కూడా చాలా సంతోషించి పెళ్లిపనులు చేస్తున్నారు. వక్కతే ఆడపిల్ల వటంచేత చాలా వేడుకగా చేయాలని చుట్టాలనీ స్నేహితులనీ అందరినీ పిలిచారు.

పెళ్లి సమీపించింది. ఒక్కక్కరే చు ట్టాలు వస్తున్నారు. పెళ్లివారు రేపుదయం వస్తారు. ఇంట్లో అంతా హడావుడిగా వున్నా రు. పెళ్లికూతుర్ని చేసి కల్యాణంబొట్టు పెట్టి నారు. నారాయణమూర్తిగారు వరలక్ష్మమ్మ గారు అందరిని పిలవటానికి ఊళ్లోకి వెళ్లి నారు. సరళ తల్లిదండ్రులని సరళని పిలిచి, 'సరళా నీస్నేహితురాలి పెళ్లికి నీవే పెత్త నంచెయాలి, నీవైదురోజులూ అక్కడే వుం డాలి' అని చెప్పివచ్చినారు. లగ్నం పది గంట లకు. ఉదయం 6 గంటలకల్లా విడిదిలో దిగి నారు పెళ్లివారు. పానకం తావల్లిచ్చి పెళ్లికొ డుకుని తీసుకునివచ్చి అంకురార్పణకి కూర్చు న్నారు. పెళ్లికూతురు లోపల గౌరీ పూజ చేస్తూంది. పెళ్లికొడుకుకూ పెళ్లికూతురుకూ మధ్య తెర అడ్డం కట్టినారు. పురోహితుడు పెళ్లికూతుర్ని తీసుకురమ్మని కేకలు పెడుతు న్నాడు. పెళ్లికూతురి మేనమామ ప్రేలగంప తీసుకువచ్చి అక్కడ దింపినాడు. దేవకన్యక లాగు కమల గంపలోనుంచి దిగి పీటపయిన కూర్చుంది. తలిదండ్రులు కన్యధారపోశారు. వరదక్షిణ క్రింద నూటపదహార్లు యకరం భూమీ యిచ్చారు. సరళకి పెళ్లి ఇష్టంలేక పోయినా కమలని చూస్తే యిష్టం గనుక దగ్గరే కూర్చుని మూడుముళ్లూ వేయించింది. ముత్తయిదులంతా-

"ఆనందమానంద మాయెను
మనరాముడు పెళ్లికొడు కాయెను
మనజానకి పెళ్లికూతు రాయెను
సకలజనులకు సంతోష మాయెను."

అని పాడినారు. ఐదురోజులూ పెళ్లి సల క్షణంగా జరిగింది. వియ్యపురాలి లాంచనా లనీ ఆడబడుచులాంచనాలనీ పోట్లాడక వియ్య పురాళ్లూ వియ్యంకులూ చాలా సరదాగా హాస్యాలతో అయిదురోజులూ జరిపినారు.

గృహప్రవేశమునకు పిల్లని తీసుకువెళ్లి నారు. కూడా సరళతలిదండ్రుల నడిగి సరళ నే పంపినారు. సరళవస్తేనేగాని వెళ్లనంది కమల. అక్కడ మూడురోజులుండి మళ్లీ వచ్చినారు.

ఈవిధముగా కొన్నిరోజులు గడచినవి. కమలకు యుక్తవయస్సు రాగానే బడికి పంప డం మంచిదికాదని బడి మాన్పించినారు. ఆమె యింట్లోనే తండ్రిదగ్గర చదువుకుంటూ మంచి సంగతులన్నీ తెలుసుకుంటూ వుండేది. కమ లని బడి మాన్పించటం సరళకిష్టంలేదు. ఒంట రిగా బడికి వెళ్లటం సరళకి కష్టంగా వుండేది.

సరళకుకూడా యుక్తవయస్సు వచ్చినది కాని బడికి వెళ్లుచూనే యున్నది. సరళ యిప్పుడు నాల్గవ ఫారం చదువుతున్నది. తల్లితోకూడా క్లబ్బుకు వెళ్లి టెన్నీసుఆట నేర్చుకుంటున్నది. ఒక్కొక్కప్పుడు సరళా కమల లిద్దరు కమలగారి దొడ్లో మామిడిచెట్టుక్రింద కూర్చుని అంతులేని కబుర్లు చెప్పుకునేవాళ్లు పొద్దుపోయినదికూడా తెలియకుండా. కమల తల్లి పొద్దుపోయిందని పిలుస్తే వెళ్లేవారు. ఒక్కొక్కరోజు సరళ ఇంటికి వెళ్లేదేకాదు. “కమలా నీవు కొద్దిరోజుల్లో అత్తవారింటి కెడతావు కాబోలు; నే నెప్పుడైనా వస్తే జ్ఞాపకముంచుకుంటావా? నీవు వెడితే నాకీవూళ్లో తోచదు. నామాట విన్నావా పెళ్లిచేసుకో వద్దంటే? పెళ్లిచేసుకోకపోతే వెళ్ళనక్కరలేదు గదా!” అనేది సరళ. విని నవ్వుతూ ఊరుకునేది కమల.

ఇల్లా కొన్నిరోజులు గడచినవి. కమల అత్తవారింటికి వెళ్లినది. వదిలి వుండటం సరళకు, కమల తలిదండ్రులకు చాలా కష్టముగా వుండేది. దగ్గరవూరేగనుక వారమున కొకసారి వెళ్లిచూచి వచ్చేవారు. కమల అత్తవారింట్లో అందరికీ అణుకువగావుండి అత్తగారినే పనీచేయనీయకుండా అన్నిపనులలోనూ తనే వుండి అత్తమామలకు శుశ్రూషచేస్తూ భర్తకనుకూలవతియై వుండేది. తనకు తీరుబడియైనప్పుడల్లా పిల్లల్నందరినీ చేర్చుకొని పాటా పద్యం నూలువడకటం హిందీ మొదలైనవన్నీ నేర్పేది. వాళ్ల యిల్లు భూలోకస్వర్గము లాగు ఆనందముగా యుండేది.

సరళ స్కూలుఫైనల్ ప్యాసు అయినది. ఒకరోజు సరళ తండ్రిగారిదగ్గరకు వెళ్లి, “నాన్నగారూ, యీ సంవత్సరం టెన్నీసుపందెములు మద్రాసులో జరుగుతయి; నాకుచూపించరూ” అని అడిగింది తండ్రి ‘సరే అమ్మనుకూడా కనుక్కొని వెళదాంలేతీసుకువెడుతా’మన్నారు. తల్లికూడాసరేనన్నది. అందరూ ప్రయాణమై వెళ్లారు. ప్రతిరోజూ పందెపు ఆట చూడటానికి తలిదండ్రులతో కూడా సరళ వెళుతూ వుండేది.

ఇల్లా వారంరోజులు పందెం బాగా జరిగింది. అందులో గెలిచిన హాకీం బేగ్ అనే ఆయన బి. ఏ. ఆనర్సు ప్యాసయినాడు. టెన్నిసులోగాని పరీక్షలోగాని మొదటిగెల్పు ఆయనదే. ఆయనను చూడగానే సరళ ఆయన్నే పెళ్లిచేసుకోవా లనుకున్నది. ఆయనకూడా సరళను చూచినప్పటినుంచి ఆమెనే పెళ్లిచేసుకోవా లనుకున్నాడు. సరళతండ్రితో కొంచెం కొంచెం స్నేహం సంపాదించినాడు. రోజూ వీరింటి కాయన ఆయనయింటికి వీరు వెళ్లటం ప్రారంభించారు. అందుకని సరళకీ ఆయనకీ పరిచయమైనది.

ఒకరోజు సరళా, బేగూ మాధవరావుగారిదగ్గర కొచ్చి “మేమిద్దరం పెళ్లిచేసుకుంటాం మీరనుజ్ఞ యివ్వవలసిన” దని అడిగినారు. మాధవరావుగారు భార్యతో ఆలో